
# 3

# పునరపి మరణం




భరాగో

ఒకాయన రోడ్డుమీద వెళుతూ ఉండగా ఒకానొక దూరపు బంధువు ఆపి పలకరించాడు.

దూరపు బంధువు అంటే బంధుత్వంలో దూరం. అంతే గాని భౌగోళికంగా ఉండే దూరం కాదు. మయిలలు, పురుళ్లు పట్టించుకుంటూనే పెళ్లిళ్లకి, చావులకి రాకుండా ఏదో కారణం చెప్పి తప్పించుకునేవారు.

"పెళ్లికి వెళ్లకపోతే పట్టించుకుంటారు గాని వెళితే ఎవరూ పట్టించుకోరు" అని ఒక నుడికారం.

వివరణ కూడా చెప్పదగినదే. పెళ్లికి రాకపోతే "ఏమయ్యా, శుభమా అని మా అమ్మాయికి పెళ్లి చేస్తే వచ్చి నాలుగక్షింతలు వెయ్యడానికి తీరుబాటు లేకుండా పోయిందా?" అంటారట. వెళితేనేమో "ఓ, వచ్చావా!" అని పలకరించేసి; తరువాత ఏ బ్యాచిలో భోజనం చేశావు, నీకు కాఫీ,టిఫిన్ అందాయా; పెళ్లి మండపం దగ్గర కూర్చోవడానికి ఒక ఖాళీ కుర్చీ దొరికిందా. ఇలాంటి యోగక్షేమ విచారణ జరగదు. తిరిగి వెళ్లిపోయేటప్పుడు వెళ్లొస్తాను అని చెప్పటానికి సరైన వాళ్లు ఎవరూ ఉండరు. "వీడి మొహం చూస్తే తిరుగుప్రయాణం కేసులా ఉన్నాడు" అని గ్రహించి ఒక ప్లాస్టిక్ బ్యాగు చేతిలో పెట్టి నమస్కారం చేస్తారు. దాంట్లో ఒక లడ్డు, ఒక మినప సున్నుండ ఇలాంటివేవో ఉంటాయి. మొత్తంమీద ఎవరూ పట్టించుకోనట్టే లెక్క.

రోడ్డు మీద నడుస్తూ ఉండగా ఆపి పలకరించేవాళ్లు ఏదైనా పని ఉండి పలకరించేవాళ్లు అవరు. "వాళ్లింటికి మనం వెళ్లక్కరలేకుండా దొరికాడు కదా" అని యోగక్షేమం, వగైరా భోగట్టా చేసి తమదారిని తాము వెళ్లిపోయే వాళ్లే ఎక్కువమంది ఉంటారు.

కుమారస్వామికి ఇలాంటివాళ్లంటే చాలా చిరాకు. అతని ప్రజా సంబంధ పద్ధతే వేరు. తనకి ఎవరి దగ్గరైనా పని ఉంటే సరాసరి వారి వద్దకు వెళ్లి కాళ్లో, గెడ్డమో పట్టుకుని తనపని అయ్యేవిధంగా సలహానో, సహాయాన్నో తీసేసుకుంటాడు.

"మా మేనకోడలు వాళ్ల అమ్మాయికి పెళ్లి చేస్తోంది. ఇక్కడి కంటే అనకాపల్లిలో చీరలు చవక. అదీ కాక నీకు శ్రీధరాల వారి బట్టల షాపుతో చిన్న నాటి నుంచీ బాగా అనుబంధం వుంది. విజయనగరంలో బంగారం నాణ్యతగా ఉంటుంది. అక్కడ నాగులకొండ వారితో నీకు మంచి స్నేహం. రెండుచోట్ల, రెండింటిలోనూ మోసాలు, కల్తీలు తక్కువ. అక్కడా ఇక్కడా కూడా నీకు తెలిసిన వాళ్లు బోలెడుమంది ఉన్నారు. కారులో తీసుకెళ్లి తీసుకొస్తారు. ఎటొచ్చీ రెండురోజులు తిరగాలి. నాకు సెలవు బోలెడు ఉంది గాని బట్టల నాణ్యత, బంగారం నాణ్యత అసలు ఏమీ తెలియని వాణ్ణి. అందుచేత నేను వెళ్లినా ఒకటే, వెళ్లకపోయినా ఒకటే. నా మనవరాలు నీ మనవరాలే అనుకుని వాళ్లతో వెళ్లి ఆ పనులు సక్రమంగా అయ్యేటట్టు చూడు" అన్నాడొకసారి.

"సరుకు నాణ్యత, ఖరీదుల్లో బేరాలు నాకు బాగా తెలిసిన మాట నిజమే. కాని నీ మేనకోడల్నీ, వాళ్ల ఆయన్నీ నేను బొత్తిగా ఎరగను కదా. గంటలు గంటలు ప్రయాణాలు వాళ్లతో చేస్తూ కబుర్లు చెప్పుకోకుండా ఊరికే కూర్చోవాలి నేను. అది ఏమీ బాగుండదు. కావాలంటే అవన్నీ ఈ ఊళ్లోనే కొనేసుకోమను. సరుకులు కొనేటప్పుడు కొంత నష్టం కలిగినా టాక్సీ అద్దె ఉండదు కాబట్టి దానికీ దానికీ చెల్లు" అన్నాను.

"టాక్సీ అంటావేమిటి, కారు వాళ్ల సొంతమే. డ్రైవింగు మా పరమేశ్వరరావే చేస్తాడు, అదే మా మేనకోడలి మొగుడు. అంచేత వాళ్లు అనుకున్నట్టే చేయమని నిన్ను నేను అడుగుతున్నాను".

"అంతా బాగానే ఉంది కాని ఆ కారులో నువ్వు కూడా నాతో వస్తానంటేనే" అన్నాను.

అదీ అతని పద్ధతి. అతని పని అయ్యేదాకా ఏదోమెలిక పెట్టి నా చేత సరే అనిపించుకుంటాడు.

అయిందా! ఆ పెళ్లికి రమ్మని నాకొక కార్డు పోస్టులో వేయించాడు. నేను ఇంకొక పెళ్లిలో ఇరుక్కుని వెళ్లలేకపోయాను. కాని మా ఇద్దరితోనూ స్నేహం ఉన్న మెడికల్ షాపు ఓనర్ సీతారామ్ వెళ్లాడు. సీతారామ్, పరమేశ్వరరావు మాట్లాడుకుంటూ ఉండగా కుమారస్వామి అక్కడికొచ్చాడట. నేను పెళ్లికి వెళ్లకపోవడం మీద చర్చ వచ్చిందట.

"ఏ మోహం పెట్టుకుని వస్తాడు! ఆ బట్టల బేరంలో, బంగారం బేరంలో మా వాళ్లకి రావలసిన డిస్కౌంటు తనే లాగేసుకున్నాడు. ఆ షాపుల వాళ్లతో లాలూచీ పడి" అన్నాట్ట కుమారస్వామి.

" అబ్బే లేదు బాబాయ్ గారు! ఆ బేరాలు సాగుతూ ఉన్నప్పుడు మీరూ అక్కడే ఉన్నారు కదా! మా డబ్బు దుబారా అయిపోతుందని ఎంతో అభిమానంతో గీసి గీసి బేరమాడింది ఆయనే కదా" అన్నాడుట పరమేశ్వరరావు.


"మీకు తెలీదూరుకోండి. వాళ్లూ ఇతను ఎప్పటినుంచో పరిచయస్తులు. వాళ్లూ వాళ్లూ ఏం సైగలు చేసుకున్నారో మనకి ఏమి అర్ధమవుతాయి. అనకాపల్లి బట్టలషాపులోంచి ఇవతలకి వచ్చినవాడు రుమాలు మరచిపోయానంటూ మళ్లీ లోపలికి వెళ్లినవాడు లోపల నాలుగు నిమిషాలు ఎందుకు ఉండిపోయినట్టు?"

అంతా వివరంగా సీతారామ్ నాకు చెప్పాడు. నావల్ల ఉపకారం పొందికూడా నన్ను వేరేవాళ్ల దగ్గర అప్రదిష్టపాలు చేశాడు ఈ కుమారస్వామి.

❁ ❁ ❁

నెల రోజులు తిరక్కుండా మళ్లీ కుమారస్వామి నా దగ్గరకు వచ్చాడు. వస్తూనే సోఫాలో వెనక్కి జారబడి అక్కడ ఒక స్టూలు ఉంటేనూ కాళ్ల కిందకు లాక్కున్నాడు. "అబ్బా, ఉక్క దంచేస్తుంది. ఫ్యాను ఇంతకంటే జోరుగా తిరగదా''? అని ఉస్సూరస్సూరన్నాడు. నేను లేచి ఫ్యాను ఒక స్టెప్పు పెంచి "మంచినీళ్లు త్రాగుతావా?" అని అడిగాను.

"కొంచెం సేపు పోనీ, ఎండలో తిరిగొచ్చిన వాడు వెంటనే నీళ్లు తాగేకూడదు" అన్నాడు. సరే, అతనన్న ఆ కొంచెం సేపూ గడిచింది. అప్పుడు మంచి నీళ్లు అడిగి తీసుకుని తాగాడు "అమ్మయ్య, ప్రాణం లేచొచ్చింది......... ఏం లేదు, మొన్న మా మనవరాలి పెళ్లికి బట్టల బేరంలోనూ..బంగారం బేరంలోనూ నువ్వు చేసిన సాయం ఇంతా అంతా కాదు. పెళ్లికి నువ్వు రాలేదు కాని, ఓహోహో! నువ్వు కొనిపించిన ఆ బట్టలు చూసి, "అబ్బో ఎంత నాణ్యతగా ఉన్నాయి! ఇంత తక్కువ ధరలకి మీకు ఎలా వచ్చాయి" అంటూ నీపేరు చెప్పగానే ప్రతీవాడూ నిన్ను పరిచయం చేయమని అడగడమే"



కార్టూన్ల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కార్టూన్

ధనుష్, విజయవాడ.

అన్నాడు.

"కొంపదీసి నీ వెనకాల ఎవరినైనా రమ్మన్నావాఏమిటి?" అన్నాను.

"లేదులే, నేను వేరే పనిమీద వచ్చాను. నీకు తెలుసుగా, మా డాబా మీద ఓ గదీ, వంటిల్లూ, బాత్‌రూమూ కట్టించి ఎవరికైనా అద్దెకిచ్చేస్తే మేము లేనప్పుడు మా ఇంటికి కాపలా ఉంటారు. మేము ఉన్నప్పుడు మా ఆవిడికి చేదోడువాదోడుగా ఉంటారు. పైగా నెలకింతా అని అద్దె కూడా ముట్టచెబుతారు. అని కొన్నాళ్ల నుంచి అనుకుంటున్నాం కదా. ప్లాను వేయించి వుడా ఆఫీసుకి పట్టికెళ్తే – ఏం చెప్పను? అక్కడ ప్లానులు అప్రూవ్ చేసే ఆఫీసరు నీ శిష్యుడు దుర్గారావు ఉన్నాడు. నీపేరు చెప్పడమేమిటి, అతను నిమిషాల మీద ప్లాను ఎప్రూవ్ చేయించడానికి అన్ని ఏర్పాట్లు చేసేయడమేమిటి! పైగా, నేనక్కడున్న ఒక గంటసేపట్లోనూ అతని సొంత ఖర్చుతో నా చేత రెండు కూల్‌డ్రింకులు తాగించాడు. నువ్వు సీన్‌లో కనబడకుండానే ఇంతలేని ఉపకారాలు జరిగిపోతున్నాయి నాకు"...... కొంచెం ఆగాడు.

అదంతా విని నేను రంగంలో దిగి చేయవలసినదేదో ఉందన్న మాట అని గ్రహించాను.

"ప్లాను తెచ్చావా?" అని అడిగాను.

"ప్లాను తేవడం ఏమిటి, నువ్వు కలగజేసుకుంటే నెల తిరిగేలోపుని నిన్ను గృహప్రవేశానికి తీసుకెళ్లకపోతానా" అన్నాడు.

"అంటే కన్‌స్ట్రక్షన్ పూర్తి చేసేశావా ఏమిటి?"

"అమ్మమ్మ! నీ సాయం లేకుండా ఇంటిమీద ఇల్లు కట్టిగలనా?"

"నా సాయం ఏముంటుంది. అలాంటి వాటిలో నేను కలగచేసుకోవడం మానేసి పదేళ్లు దాటిపోయింది. ఎవడైనా మంచి మేస్త్రీని చెప్పమంటే పోలీసు క్వార్టర్స్ కట్టించినపుడు మా డిపార్టుమెంటు కోసం పని చేసిన సూపర్‌వైజర్‌కి చెప్పగలనేమో".

"నీ దయవల్ల అవన్నీ దాటేశాను. బాత్‌రూం వేపు యాస్‌బెస్టాస్ రేకులు, కిటికీ చువ్వలకి స్టీలు, ద్వారబంధాలకీ, తలుపులకీ, కలప – ఇవన్నీ నీ ద్వారానే సమకూరాలి. ఆ షాపుల వాళ్లందరినీ నీకు తెలుసు. అంతే గాక ఈ ఊళ్లో సేల్స్‌టాక్స్ డిపార్టుమెంటు, డిప్యూటీ కమీషనరు ప్రకాశరావు నీ అభిమాని. అతనితో ఒక మాట చెప్పించు. నువ్వు నలుగురికీ నాలుగు చీటీలు రాయి. దాంతో నేను ఒడ్డున పడిపోతాను"

గృహ ప్రవేశానికి కూడా నేను వెళ్లలేకపోయాను. అయితే ఆమేడగదిలో అద్దెకి దిగినవాడు నాకు తెలుసు. ఎప్పుడో 1967 నాడు నా సహోద్యోగి విజయభూషణ్ కొడుకు. అతని పేరు బాపిరాజు. కొత్తగా పెళ్లి చేసుకుని యు.పి.ఎస్.సి. ద్వారా ఇక్కడి కస్టమ్స్ కలెక్టరు ఆఫీసులో ఉద్యోగం సంపాదించుకుని చేరాడు. ఓ రోజు నా దగ్గరకు వచ్చాడు.

"నాన్నగారు నిన్న ఫోన్ చేశారండి. మీ అడ్రసు, ఫోన్ నెంబరు చెప్పారు. ముందుగా ఫోన్ చేసి వద్దామనుకున్నానండి. కాని మీ ఇంటికి ఇటువేపుని నా సీనియర్ ఒకాయన ఉన్నారు. ఒకసారి వచ్చి కనపడవోయి అన్నారు....." అని ఇంకా ఏదో చెప్పబోతూ ఉండగా నేనే భోగట్టా చేశాను. "నీ భార్య నీకు అనుకూలంగా ఉంటుందా? ఇంతో అంతో చదువుకున్న అమ్మాయేనా, మీ హౌసోనరు ఏమంటాడు?"

"మీరూ ఆయనా కలిసి చదువుకున్నారటగా, బాగా సన్నిహితులట కదా" అన్నాడు బాపిరాజు.

"అతి పరిచయాదవజ్ఞ అంటారు" నీకు సంస్కృతం రాదు కాబోలు. ఇంటిమసీ బ్రూస్ కంటెమ్ప్ట్. ఎందుకో నా మీద అతనికి దయలేదు. చిన్న గుండుసూది నుంచి పెద్ద ఇనపదూలం వరకు, చిన్న జేబురుమాలు నుంచి ఏడు గజాల పట్టుచీర వరకు ఇలా అతనికి ఏది అవసరం వస్తే దాన్ని నా పలుకుబడితో చవగ్గా సంపాదించుకుని ఇంకా చవగ్గా ఇప్పించాను కాదు అని నలుగురితో చెప్పుకుంటాడు. పైగా ఆ వస్తువులు అమ్మే వాళ్ల దగ్గర నేనేదో కమీషను కొట్టేసుంటానని నిరంతరం బాధపడిపోతూ ఉంటాడు. ఇంతకీ నేను పోలీస్ డిపార్టుమెంటులో విజిలెన్సు డి.ఎస్.పి.గా పని చేసి ఉండడమే నేను చేసిన మహాపాపం" బాపిరాజు నుదుటి మీద చేత్తో చరుచుకున్నాడు.

"అబ్బ! నాక్షోభకి సరైన వ్యాఖ్యానం చెప్పేరండి" అని రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాడు. "మేం ఆ ఇంట్లో దిగి నెల్లాళ్లూ కాలేదండి. ఈ నెల రోజుల లోపల ఆయన మెట్లెక్కి కనీసం ఇరవై సార్లైనా వచ్చుంటాడు. మా గది కాక డాబా మీద బోలెడు ఖాళీ స్థలం ఉంది కదా. అక్కడ బట్టలు ఆరవేసుకుందికి, వడియాలు, అప్పడాలు ఎండబెట్టుకుందికి ఆయన, ఆవిడ వస్తూనే ఉంటారు. ఇల్లు వాళ్లది. ఎప్పుడు పడితే అప్పుడు రావడానికి వారికి హక్కు ఉంది. కాని, సరాసరి వంటింట్లోకి ప్రవేశించేసి చొరవగా నా భార్యని పలకరించడమే కాక అడిగీ అడిగించుకునీ కాఫీలు, టీలు సేవించడం కూడా అతని హక్కు అనుకుంటాడు పాపం. వంటింట్లో పుట్టే ఘాటు వాసనలు, బాత్‌రూంలో పుట్టే చెడువాసనలు బయటికి పోవాలంటే రెండు ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లు కావాలని మా ఆవిడ అతనితో చెప్పిందట. దానికి ఆయన బోలెడు కథ చెప్పాడు"

ఏముందీ! ముందు ఆ ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లు బిగించడానికి గోడలలో కొంత భాగం చొప్పున పగలగొట్టాలి. దానికి మేస్త్రీ ఖర్చు. ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లు కొనాలి. అది మరో ఖర్చు. అసలు ఫ్యాన్‌ల ఖరీదులు మనం అర్థం చేసుకోలేనంత విచిత్రంగా ఉంటాయి. సీలింగ్ ఫ్యాన్ ఖరీదు కంటే టేబుల్ ఫ్యాన్ ఖరీదు ఎక్కువ. టేబుల్ ఫ్యాన్ ఖరీదు కంటే ఎగ్జాస్ట్ ఫ్యాన్ ఖరీదు ఎక్కువ. వాటికి మళ్ళీ వైరింగు. ఆ వైరు ఇంతకు ముందు ఉపయోగించినదానికంటే గట్టిది ఉండాలి. అదంతా ఎలక్ట్రీషియన్ మీద పెట్టే ఖర్చు. ఇంతకీ ఆ ఫ్యానులు ఎక్కడ దొరుకుతాయి, ఆ మేస్త్రీని ఎక్కడి నుంచి పిలవాలి, ఆ ఎలక్ట్రీషియన్‌ని ఎలా పట్టుకోవాలి, ఇవన్నీ సమస్యలే. ఈ దండకం అంతా చదివి పని ఎగగొడదామని ప్రయత్నం చేసి బాపిరాజు బుర్ర తినేసుంటాడు కుమారస్వామి.

అంటే కుమారస్వామి రేపో నేడో మళ్ళీ నన్ను తగులుకుంటాడు. ఎందుకంటే ఈ బాపిరాజు (అతి చిన్న కుటుంబం) తన ఇంట్లో అద్దెకు దిగినందువల్ల సమస్యలేమీ పెద్దగా ఉండవు పైగా కస్టమ్స్‌లో పనిచేస్తున్నాడు. కాబట్టి కొన్ని రకాల సరుకులు ఇతని పలుకు బడిలో కుమారస్వామి చవకగా సంపాదించుకోగలుగుతాడు 'అవన్నీ ఇప్పుడు కుదరవు. మీకు ఇష్టముంటే ఉండండి, లేకపోతే ఇల్లు ఖాళీచేసి వెళ్లిపోండి' అనే పరిస్థితి లేదు.

అందుచేత మళ్లీ కుమారస్వామికి ఈ ఏర్పాట్లన్నిటికీ నేను తోడ్పడవలసిందే. మళ్లీ ఈ ఏర్పాట్లు చేస్తున్న సందర్భంగా నేను అయా షాపులనుండి, అయా వర్కర్ల నుండి కస్పీలు కొట్టేసి దాంతోనే నా జీవితాన్ని గడుపుకుంటున్నానని పదిమందితో చెప్పుకుంటూనే ఉంటాడు.

నన్ను బాగా తెలిసినవాళ్లు ఆ ముచ్చట్లు విని అతనిని కూడా బాగా తెలుసుకుంటారు.

నాకూ అతనికీ భజగోవిందానికీ, గీత గోవిందానికీ మధ్య ఉన్న తేడాలాంటిది ఏదో ఉన్నా ఆ రెండూ ఉత్తమ సంస్కృత శ్లోక సముదాయాలే కదా అని నన్ను నేను సముదాయించుకుంటూ ఉంటాను.